క్లుప్తంగా

వెండి తొడుగు అందజేత


శివలింగానికి అలంకరించిన వెండి తొడుగు

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామ శివాలయంలో వెలసిన శివలింగానికి ఓ దాత వెండి తొడుగును బహూకరించారు. గ్రామానికి చెందిన వాసగిరి తిమ్మయ్య అర్చకుడుగా పని చేశాడు. ఆయన మరణాంతరం కుటుంబ సభ్యులు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. స్వగ్రామంలోని మహాశివుడికి ఆయన భార్య వాసగిరి సావిత్రి, కుమార్తె లక్ష్మీదేవి శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని కేజిన్నర వెండితో చేయించిన తొడుగును అందజేశారు. అర్చకులు కిట్టయ్యశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు శుక్రవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధి కారులు తెలిపారు. డ్యాంలో 0.143 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు రథోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో శనివారం నాగలింగేశ్వర, కేశవ స్వామి రథోత్సం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి గుర్రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణంతో పాటు రథోత్సవం జరుపుతున్నామన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు.

10న ఎడ్ల బండలాగుడు పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నాగలింగేశ్వర, కేశవస్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 10న ఆదివారం జిల్లా స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు శుక్రవారం సర్పంచు వెంకటేశ్వరమ్మ తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం


ఎంపీడీఓ మల్లీశ్వరిని సన్మానిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంఈఓ ఓంకార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓ మల్లీశ్వరి, ఉపాధ్యాయినులు విజయలక్ష్మి, మద్దమ్మ, హరిప్రియను ఘనంగా సత్కరించారు. జిల్లా, మండల బాధ్యులు ఆదినారాయణరెడ్డి, జాగిర్దార్, శ్రీనివాసరెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

పాణ్యం: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో శనివారం అమరావతిలో జరిగే వికలాంగుల మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు గద్దల సామేలు కోరారు. శుక్రవారం గోనవరం గ్రామంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులకు పింఛన్ మొత్తం రూ.6వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు బాబు, చార్లెస్, రంగ,లక్ష్మీ, దివెనమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ

కోడుమూరు రూరల్: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి వెళ్లి చంద్రబాబు జైల్లో ఉండగా గుండెపోటతో చనిపోయిన నాగార్జున గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి నాగార్జున గౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ బొగ్గుల దస్తగిరి, కోట్ల కవితమ్మ, సీబీ లత, మధుసూదన్ రెడ్డి తదితరులున్నారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో శనివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాలపాళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమిరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులు తెలిపారు. ఈ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 94413 12075, 96401 18716 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.


కోడుమూరు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న చైర్మన్


కోడుమూరులో ప్రత్యేక అలంకరణలో కస్తూరి నాగప్ప


గుడిపాడులో రామలింగేశ్వరస్వామి ప్రభకు పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు


స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

కోడుమూరు రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు చేరుకొని శివుడికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, కమిటీ సభ్యులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీనీలకంఠేశ్వర ఆలయం, కోటవీధి భీమలింగేశ్వరస్వామి, గుంత శివాలయం, కాళికామాతా ఆలయం, ఈశ్వరాలయంలో భక్తులు శివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

వర్కూరు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో..

మండలంలోని వర్కూరులో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం శనివారం తెలవారుజామున జరిగే శివపార్వతుల కల్యాణం కోసం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పుట్టమన్ను, తోరణాలు తెచ్చి పెండ్లి పందిరి వేశారు.

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరస్వామి ప్రభోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు రంగారెడ్డి గారి చంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామలింగేశ్వరస్వామి ప్రభోత్సవం ఘనంగా జరిగింది. రామలింగేశ్వరస్వామి ప్రభకు గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించి నందికోళ్ల సేవ ద్వారా మేళతాళాలతో ఊరేగించారు. ఆలయం నుంచి వంక వరకు, అక్కడి నుంచి ఆలయం వరకు ప్రభను భక్తులు లాగారు. శనివారం రామలింగేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.


సి.బెళగల్ శివాలయంలో అమ్మవారి మంగళసూత్రలను ప్రదర్శిస్తున్న పురోహితులు

కమనీయం.. కల్యాణం

సి.బెళగల్: స్థానిక శివాలయంలో శుక్రవారం శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. పురోహితులు సుదర్శణ చారులు సమక్షంలో సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, సీబీ వెంకటేశ్వరరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు.

➡ సి.బెళగల్‌లోని కోట వీధి రాజరాజేశ్వరి ఆలయంలో అభిషేకాలు, బస్టాండ్ ఆవరణంలోని శివాలయంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, కొండ మీద గట్టు మల్లప్పకు పల్లకీ, నందికోలు, తమల పాకుల అలంకరణ సేవలను, పంచామృత అభిషేకం, గ్రామ శివారులోని అన్నప్ప స్వామి వారి గుడికి పథాక ప్రతిష్ఠలతో పాటు జాగారణ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే కొత్త కోట, కె.సింగవరం, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, కంబదహాల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో రాత్రి భక్తులు జాగరణ చేశారు. పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన చెన్నసోమేశ్వర స్వామి గుడిలో జాగరణ సందర్భంగా భక్తులకు గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు.

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

- ఘనంగా మహాశివరాత్రి

పాణ్యం: మహాశివరాత్రి పురస్కరించుకొని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజామున నుంచి భక్తులు శైవక్షేత్రాలకు చేరుకుని మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్థానిక పాణికేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకాలు చేపట్టారు. అలాగే శ్రీభృంగేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. రైల్వే గేటు వద్ద ఉన్న శ్రీ మంజునాథస్వామి ఆలయంలో అర్చకులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

గడివేముల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎర్రమల కొండలలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రంలో అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ భోగేశ్వరస్వామి వారికి శుక్రవారం ప్రాతఃకాల పూజలు,మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా రావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. కాశినాయన,వీరశైవులు,బ్రహ్మణ,ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు వరప్రయాణం సందర్భంగా ఆలయ ప్రాంగణాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ధర్మకర్త పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


భోగేశ్వరుడినికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం


ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బుగ్గరామేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- శనివారం తెల్లవారుజామున కల్యాణోత్సవం
- 10న సాయంత్రం రథోత్సవం
- 13న ముగియనున్న బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన భ్రమరాంభదేవి, బుగ్గరామేశ్వరస్వాముల వారి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవస్థానం ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినానికి అంకురార్పణ గావించి, ధ్వజారోహణం చేశారు. ఉదయం భ్రమరాంభిక, బుగ్గరామేశ్వరస్వాముల వారికి గణపతి పూజతో పంచామృతాభిషేకం జరిపించారు. రాత్రి స్వాముల వారికి యమాభిషేకం, తెల్లవారు జామున 3.35 గంటలకు కల్యాణోత్సవానికి ఏర్పాటు పూర్తిచేశారు. 9న ఉదయం 11 గంటలకు సింహవాహన సేవ, నందివాహన సేవ, ప్రభోత్సవం నిర్వహిస్తారు. 10న రథోత్సవం, 11న వసంతోత్సవం, సాయంత్రం పారువేట కార్యక్రమాలను ఉంటాయని ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. 12న స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, 13న ఉత్సవమూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని అభిషేకార్చనలతో మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు పీఎల్ వరలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. కాగా వర్షాభావ పరిస్థితులు కారణంగా ఎండిపోయిన రెండు పుష్కరిణిలను నిర్వాహకులు నీటితో నింపారు. దీంతో భక్తుల స్నానాలకు ఇబ్బందులు తీరాయి. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


స్వాముల వారికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు


జేడీఏ దంపతులను ఆశీర్వదిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు


పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం


ముస్తాబైన గడిగరేవుల హెల్త్ సెంటర్

ప్రారంభానికి సిద్ధం

గడివేముల: మండలంలోని కొరటమద్ది,గడిగరేవుల గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం ప్రారంభిస్తారని మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం,ఆర్బీకే ,హెల్త్ సెంటర్‌తో పాటు గడప గడపకు నిధులతో వేసిన సీసీ రోడ్లు,డ్రైనేజీలు ప్రారంభించనున్నారు.

రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు..

భోగేశ్వరంలో మహా శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరు,నాలుగు పళ్ల ఎద్దుల రాష్ట్రస్థాయి పోటీలను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభిస్తారని ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ చేయూత మహిళలకు వరం
- మండలంలో 4,160 మంది అక్క చెల్లెమ్మలకు రూ.7.80 కోట్ల లబ్ధి

కల్లూరు: మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుంది. మహిళలు స్వయం శక్తిగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను వారి పేరు మీదుగా అమలు చేస్తున్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 45 ఏళ్ల నుంచి 60 సంవత్సరాలోపు వయస్సు ఉన్న ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు వైఎస్సార్ చేయూతన పథకం కింద ఇప్పటికే మూడు విడతలుగా రూ.18,750 చొప్పున అందజేసింది. ప్రస్తుతం నాలుగో విడత కింద 4,160 మంది అక్క చెల్లెమ్మలకు రూ.7.80 కోట్లు విడుదల చేసింది.

గ్రామాల వారీగా లబ్ధిపొందిన మహిళల వివరాలు..

సచివాలయం పేరు	లబ్ధి పొందిన మహిళలు	సచివాలయం పేరు	లబ్ధి పొందిన మహిళలు
ఎ.గోకులపాడు	139	పర్ల-1	157
బస్తిపాడు	209	పర్ల-2	191
బొల్లవరం	173	పెద్దపాడు	391
చిన్నటేకూరు	270	పెద్దటేకూరు	339
కె.మార్కాపురం	160	పుసులూరు	202
కొంగనపాడు	173	సల్కాపురం	230
లక్ష్మీపురం-1	314	తడకనపల్లె	230
లక్ష్మీపురం-2	118	ఉలిందకొండ-1	223
నాయకల్లు	169	ఉలిందకొండ-2	230
పందిపాడు	242	మొత్తం	2193
మొత్తం	1967		

మహానందీశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తులు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు మహానందీశ్వరుడి సన్నిధిలో పూజలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన న్యాయమూర్తులు రాంభూపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. వారితో పాటు నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి


సేవకుల సదస్సులో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి

కర్నూలు (టౌన్) : క్రైస్తవుల సంక్షేమానికి వైఎస్ జగన్ సర్కారు విశేష కృషి చేస్తోందని ఏపీ ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు రెవరెండ్ బాలస్వామి అన్నారు.వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులందరూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో క్రిస్టియన్ మైనార్టీల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం పాస్టర్లకు రూ.5 వేలు గౌరవ వేతనం అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తన హయాంలో కర్నూలు నగర పాస్టర్ల సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే సీఎస్ఐ చర్చికి సంబంధించి సమాధుల తోట మంజూరు చేయించినట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపునకు క్రైస్తవ మైనార్టీలు సహకరించాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగర శివారులోని ఆదర్శ విద్యామందిర్‌లో నేటి నుంచి రెండు రోజుల (9,10 తేదీల్లో) పాటు 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించిన లోగోను శుక్రవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని గురుదత్త పాలీ క్లినిక్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో ఎన్నో అవకాశాలు లభిస్తాయన్నారు. కర్నూలులో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించడం శుభపరిణామమని, క్రీడాకారులు ఇటువంటి అవకాశాన్ని వినియోగించుకుని ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, చిన్నసుంకన్న పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళా కానిస్టేబుళ్లను సత్కరిస్తున్న సీఐ మన్సూరుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు


పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సర్పంచు భాగ్యరత్న

కోడుమూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐ మన్సూరుద్దీన్ ఆకాంక్షించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లను ఎస్‌ఐ బాలనరసింహులు, సిబ్బందితో కలిసి సీఐ సత్కరించారు.

పంచాయతీ కార్యాలయంలో..

మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న గ్రామ సచివాలయ మహిళా సిబ్బంది, వలంటీర్లతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


దోమల నివారణ మందుల పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి, ఎంపీహెచ్ఈఓ నరసప్ప సూచించారు. శుక్రవారం కొండపేటలో ఒకరికి డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో కోలోకేటిడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆ ఇంటి పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. దోమల నివారణ మందులను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం పగటి పూట కుట్టే దోమల వల్ల వస్తుందన్నారు. తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతుంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.